సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 13-12-2024

సంపుటి: 20 సంచిక: 221

పేజీలు: 4 వెల: రూ.1













## స్వర్ణాంధ్ర@2047

### సంపన్నమైన, ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన ఆంధ్ర

# పది సూత్రాలు ఒక విజన్

స్వర్ణాంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు

**ఆవిష్కరణలో మాతో చేరండి**



- పేదరిక నిర్మూలన
- ఉపాధి కల్పన
- నైపుణ్యం & మానవ వనరుల అభివృద్ధి
- ఇంటింటికీ నీటి భద్రత
- రైతు - వ్యవసాయ సాంకేతికత
- ప్రపంచస్థాయి పంపిణీ వ్యవస్థ (లాజిస్టిక్స్)
- శక్తి మరియు ఇంధనాల వ్యయ నియంత్రణ
- అన్ని రంగాలలో పరిపూర్ణ ఉత్పాదన
- సమగ్ర విధానాలతో స్వచ్ఛాంధ్ర
- అన్ని దశలలో సమగ్ర సాంకేతికత

**తేదీ : 13-12-2024**

**వేదిక : ఇందిరా గాంధీ స్టేడియం, విజయవాడ**

• ఎడిటోరియల్

# పథకాలకు, తెల్లకార్డుకు లింక్ తెగ్గొట్టాలి

రాష్ట్రంలో పీడీఎస్ బియ్యం కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు తరలిపోతుందని 'సీజ్ ద షిప్' అంటూ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలో దుమారం రేపుతున్నాయి. నిజంగా పేదల బియ్యమే స్మగ్లింగ్ జరుగుతుందా? అంటే సమాధానం దొరకని ప్రశ్నలు కోకొల్లలు. కోవిడ్‌కి ముందు రేషన్ బియ్యం ధర కేజీ రూపాయి ఉండగా, కరోనా నుంచి ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. పైగా గత కొద్దికాలంగా సార్టెక్స్ మెషీన్లు వచ్చిన తర్వాత నూక, మట్టి, చిన్నచిన్న రాళ్లను తొలగించి పోర్టిఫైడ్ బియ్యం కలిపి ఇస్తున్నారు. దీంతో చాలామంది పేదలు, చిన్న సన్నకారు రైతులు, రైతు కూలీలు, కార్మికులు ఇదే బియ్యాన్ని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం స్వర్ణరకం బియ్యం పంపిణీ చేస్తున్నారు. నాణ్యత ఫర్వాలేదు. కేజీకి 43 రూపాయలకి పైగా ఖర్చు చేస్తున్న పాలకులు మరింత నాణ్యమైన బియ్యం పంపిణీ చేయొచ్చు. బియ్యం కోసం కాకుండా కేవలం ప్రభుత్వ పథకాల కోసమే తెల్లరేషన్ కార్డులు పొందుతున్నవారు మాత్రం ఆ బియ్యాన్ని అమ్మేస్తున్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఇప్పటికీ తెల్లరేషన్ కార్డే ప్రామాణికం. తెల్లకార్డు లేదంటే ఆరోగ్యశ్రీ రద్దయిపోతుందనే ఆందోళన చాలామంది లబ్ధిదారుల్లో ఉంది. చాలా పథకాలకు రేషన్‌కార్డుతో సంబంధం లేదని అధికారులు చెబుతున్నా అంతిమంగా ఆ కార్డునే లెక్కలోకి తీసుకుంటున్నారు. బియ్యం తీసుకోపోతే కార్డు రద్దవుతుందనే భయంతోనే చాలామంది లబ్ధిదారులు తెల్లరేషన్ కార్డులు పొందుతున్నారు. ఇది అంతిమంగా బియ్యం బ్లాక్‌మార్కెట్‌కి తరలిపోవడానికి కారణమవుతోంది. రేషన్ బియ్యంతోనే అన్నం వండుకునే వాళ్లతో పాటు వాటిని అన్నానికి కాకుండా ఇతరత్రా (దోశల్లో వాడేందుకు, బియ్యపు పిండి చేసేందుకు, కోళ్లకి దాణా వేసేందుకు) వినియోగించే వాళ్లు బియ్యాన్ని అమ్ముకోవడం లేదు. రేషన్ బియ్యం తీసుకునే వాళ్లలో సుమారు సగం మంది వాటిని అమ్ముకుంటున్నారని అంచనా. హోటళ్లకు కిలో రూ.15 నుంచి రూ.18 మధ్య అమ్మేస్తుంటారు. కొంత మంది వీధి వ్యాపారులకు విక్రయిస్తుంటారు. వీరు కేజీకి 18 నుంచి 20 రూపాయల వరకు ఇస్తారు. ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని వాళ్లు దళారులకు 25 రూపాయలకు అమ్ముతారు. ఆ దళారులు పెద్దమొత్తంలో బియ్యాన్ని పోగు చేసి క్వింటాళ్ల లెక్కన తిరిగి రైస్‌మిల్లుల్లో రీసైక్లింగ్ (పాలిష్ పట్టి సన్నబియ్యంగా మార్పించడం) చేయిస్తారు. లేదంటే నేరుగా కాకినాడ పోర్టుకే తరలించేస్తారు. రేషన్ బియ్యం సిండికేట్లు ఎంతబలంగా ఉంటాయంటే.. ఆ సిండికేట్ నేతలు ఎవరినైనా ప్రభావితం చేయగలరు. అందరికీ అందాల్సిన వాటాలు అందుతాయి. రేషన్ డీలర్ పాత్ర చాలా చిన్నది. పైగా ఎండీయూ ఆపరేటర్లు వచ్చిన తర్వాత డీలర్లు నామమాత్రమైపోయారు. పైకి కనిపించని వందల కోట్ల సామ్రాజ్యమిది. ఇటీవల చాలామంది లబ్ధిదారులు మొబైల్ డిస్పెన్సరీ యూనిట్(ఎండీయూ) ఆపరేటర్ వద్దనే అమ్మేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి బియ్యం పంపిణీ విధానంలో మార్పులొచ్చాయి. రేషన్ డీలర్ స్టాకిస్ట్‌గా వ్యవహరిస్తారు. ఎండీయూ ఆపరేటర్ల నుంచి రేషన్ విడిపించుకునే క్రమంలో పంచదార, కందిపప్పు తీసుకుంటున్న లబ్ధిదారుల్లో చాలామంది బియ్యం మాత్రం తిరిగి ఆపరేటర్‌కే ఇచ్చేస్తున్నారు. కేజీకి 15 రూపాయల చొప్పున అతనికే విక్రయించేస్తున్నారు. సదరు ఆపరేటర్ తిరిగి ఆ బియ్యాన్ని దళారులకు అమ్ముకోవడం, అక్కడి నుంచి రైస్‌మిల్లులకో లేదా కాకినాడ పోర్టు ద్వారా విదేశాలకో తరలిపోతోంది. బియ్యం స్మగ్లింగ్ అనే పదం సరికాదు. 1246, ఎస్ఎల్‌టి ధాన్యం రకాలను రైతులు పండించినా ఎఫ్‌సీఐ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్లు కొనుగోలు చేయడం లేదు. అవి తక్కువ కాలంలో దిగుబడి వచ్చే పంటలు. వాటిని ప్రభుత్వ సంస్థలు కొనకపోవడంతో రైతులు మిల్లర్లకి అమ్ముకుంటే మిల్లర్లు వాటిని ఎక్స్‌పోర్ట్ చేస్తున్నారు. వాటిని విదేశాల్లో బాగానే తింటారు. 80 శాతం ఆ బియ్యమే ఎగుమతి చేస్తారు. దాని మాటున 20 శాతం రేషన్ బియ్యం కూడా కొంత వెళ్లొచ్చు. అది కూడా దళారులు కొనుక్కున్న బియ్యమే. రేషన్ బియ్యం దందా ఏపీలో కొన్ని దశాబ్దాలుగా సాగుతోంది. రాష్ట్రంలో ఎక్కువ శాతం లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని వినియోగించడం లేదు. ఇది అందరికీ తెలిసిన నిజం. అయితే, ప్రభుత్వాలు దీనిపై సీరియస్‌గా దృష్టి సారించాలి. ఆరోగ్యశ్రీ, బియ్యం - ఈ రెండు పథకాలకు డబ్బులు చెల్లించేది ప్రభుత్వమే. అన్నింటికీ రేషన్ కార్డు తప్పనిసరనే నిబంధన తొలగిస్తే, ఆ ఉచిత బియ్యం మిగులు ద్వారా రాష్ట్రంలో మరికొన్ని కుటుంబాలకు ప్రయోజనం కలిగించవచ్చు.





# కిడ్నాపర్స్‌కు అడ్డాగా మీరట్!

**ఇప్పుడంటే మీరట్ అని పిల్చుకుంటున్నాం గానీ.. ఒక నాడు మైదంత్ కా ఖేరా అని పిల్చేవాళ్లు. ఎందుకంటే ఈ రాజధానిని నాడు రావణాసురుడి మామ, మండోదరి తండ్రి మయాసురుడు పాలించేవాడు. ఆ తర్వాత దీన్ని మైరాష్ట్ర అని కూడా సంస్కృత పేరుతో పిల్చేవారు. అలా మైరాష్ట్ర, మై దంత్ కా ఖేరా, మైరాట్ నుంచి ఇప్పుడు మీరట్ గా స్థిరపడిపోయింది. అలాంటి ఓ చారిత్రక ప్రాంతం మీరట్.. ఇప్పుడు కిడ్నాపర్స్ హబ్‌గా సెలబ్రిటీస్‌ని వణికిస్తూ వార్తల్లోకెక్కుతోంది.**

బాలీవుడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ ముస్తాక్‌ఖాన్‌కు ఓ అవార్డ్ ఫంక్షన్ ఉంది. మీకు అవార్డ్ ఇస్తున్నాం. మీరు తప్పకుండా రావాలని ఫోన్ వచ్చింది. ఫ్లైట్ టిక్కెట్స్ బుక్ చేయడంతోపాటు, ఆ కార్యక్రమానికి హాజరైనందుకు కొంత అడ్వాన్స్ పేమెంట్ కూడా చేసేశారు. అదేదో బాగుందనుకున్న సదరు నటుడు ముంబై నుంచి ఢిల్లీ చేరుకున్నాడు. ఢిల్లీలో దిగిన తర్వాత కొందరు ముస్తాక్‌ను కారులో ఎక్కించుకుని.. బిజ్నోర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని ఓ ఏకాంత ప్రదేశానికి తీసుకెళ్లారు. ఎందుకు అటువైపుగా తీసుకెళ్తున్నారో తెలియని ముస్తాక్.. అవార్డ్ ఫంక్షన్‌కే వెళ్తున్నానుకుంటున్నాడు. కానీ, అక్కడికెళ్లాక తెలిసింది. తనను కిడ్నాప్ చేశారని. ముస్తాక్‌ను ఏకంగా కోటి రూపాయలు డిమాండ్ చేశారు కిడ్నాపర్స్. 12 గంటలపాటు టార్చర్ పెట్టారు. ముస్తాక్‌ఖాన్‌తో పాటు, అతడి కొడుకునూ ఫోన్‌లో బెదిరించి ఇద్దరి ఖాతాల నుంచి రెండు లక్షల రూపాయలు కొల్లగొట్టారు. అయితే, ముస్తాక్ ఖాన్ చాకచక్యంగా అక్కడి మసీద్ ప్రార్థనలు విని అక్కడినుంచి ఎలాగోలా బయటపడి మసీదుకు వెళ్లాడు. తన పరిస్థితి చెప్పి తిరిగి రావడానికి అక్కడివారి సాయం కోరాడు. ఆ తర్వాత వెంటనే బిజ్నోర్ పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.


అయితే, ఇది కేవలం ముస్తాక్‌ఖాన్ ఒక్కడి విషయంలోనే కాదు. సెలబ్రిటీస్ టార్గెట్‌గా ఈవెంట్స్‌కు ముఖ్య అతిథుల పేరుతో, అవార్డ్స్ అందజేస్తామంటూ అవార్డ్స్ ఫంక్షన్స్ పేరుతో కిడ్నాపర్స్ తెరలేపిన ఓ కొత్త డ్రామా.

ఈ డిసెంబర్ నెల ప్రారంభంలోనూ ఇలాంటి ఘటనే మరోటి అందుకో ఉదాహరణ. సునీల్‌పాల్ అనే బాలీవుడ్ హాస్యనటుడు, స్టాండప్ కామెడీ షోస్ భాగస్వామి, ఓ సినిమా కూడా తీసిన దర్శకుడు.. డిసెంబర్ 2వ తేదీన హరిద్వార్ లో ఓ కార్యక్రమానికి వెళ్తుతున్న క్రమంలో కిడ్నాప్‌కు గురయ్యాడు. సునీల్‌ను కిడ్నాప్ చేసిన అగంతకులు తాము అర్జంటుగా బంగారం కొనేందుకు తమకు డబ్బు కావాలంటూ సునీల్ ఖాతాలో ఉన్న రూ.8లక్షలు బలవంతంగా కొల్లగొట్టారు. ఆ కేసునూ నమోదు చేసుకున్న పోలీసుల దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యకులు ఆభరణాలు కొంటుండగా వారిని పట్టుకున్నారు.

సెప్టెంబర్ 8న ప్రముఖ టీవీ నటుడు రాజేశ్ పూరీ ఓ అవార్డ్ ఫంక్షన్‌కు వెళ్తుండగా.. కిడ్నాపర్స్ తనను అపహరించే యత్నం చేశారు. సేమ్ ముస్తాక్‌ఖాన్ కేసులాగానే.. కిడ్నాపర్స్ రాజేశ్ పూరీకి ముందస్తుగా ఓ 35 వేల రూపాయల అడ్వాన్స్ పేమెంట్‌తో పాటు.. విమాన టిక్కెట్స్ పంపించారు. అంత మర్యాద చేస్తున్నప్పుడు దాన్ని రాజేశ్ పూరీ కూడా అనుమానించలేకపోయాడు. అంగీకరించాడు. అయితే, అదృష్టవశాత్తూ మీరట్ నుంచి ఓ 12 కిలోమీటర్ల దూరంలోనున్న ఓ దాబా వద్ద ఓ వ్యక్తితో మాటలు కలిసి సందర్భంలో.. తానెందుకు వచ్చానో చెప్పినప్పుడు ఆప్ వాపస్ చలే జావో, ఇదరు కుచ్ బీ ఠీక్ నహీ హై, కోయి ఫంక్షన్ బీ నహీ హై, ఔర్ ఆప్ కిడ్నాప్ హెూ గయే హెూ.. అంటూ చెప్పగానే రాజేశ్‌లో అనుమానం మొదలైంది. దాంతో రాజేశ్ సినీ, టీవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ సభ్యులకు ఫోన్ చేసి తన అనుభవాన్ని పంచుకున్నాడు. అయితే, అప్పటికే ఈ విషయంపై సినీ, టీవీ వర్గాల్లో చర్చ జరుగుతుండటంతో సీఐఎన్‌టీఏఏ సభ్యులు వెంటనే మీరు జాగ్రత్త పడండి.. వారి ఉచ్చులో పడకండని చెప్పడంతో రాజేశ్ తన కిడ్నాప్ నుంచి తప్పించుకున్నాడు.

రాజేశ్ తన విషయాన్ని హాస్యనటుడు సునీల్‌పాల్‌తో కూడా సునీల్ పాల్ కిడ్నాప్‌కు 20 రోజుల ముందే షేర్ చేసుకున్నాడు. అయినా, అప్రమత్తత లేకపోవడమో.. నమ్మకమో ఆ తర్వాత సునీల్‌పాల్ కిడ్నాపర్స్‌కు దొరికిపోయాడు. ఈ ఘటనలకు ఇప్పుడు ఢిల్లీకి దగ్గరగా ఉండే మీరట్ ఓ హబ్ గా మారిపోయింది. దీంతో సెలబ్రిటీలు తస్మాత్ జాగ్రత్త అనే హెచ్చరికలు.. అనుభవజ్ఞుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...



హిందీలో జూలీ (1975) సినిమా విడుదల తరువాత దేశంలోని యువత నటి లక్ష్మి గారి గురించి ఈ విధంగా పాడుకొనేవారు అంటే అతిశయోక్తి కాదు... "నీ సమక్షంలో నేను సర్వం మర్చిపోతున్నా.. ఈ ప్రపంచాన్నే నీ చిత్తరువుగా చేసుకుంటున్నా...(ఆ మై తెరా యాద్ మే .. సబ్ తో భూల్ దో... దునియా కొ తెరే తస్వీర్ బనాదో)" అంటూ ఆమెని చూసి పరవశించి పోయాడతను. అతను ఒక్కడేనా, ఆ తరం మొత్తం వివశమై ఆమె వశమైపోయి, 'దిల్ క్యా కరే జబ్ కిసీ సె, కిసీ కొ ప్యార్ హెూ జాయే (ఒకరి ప్రేమలో ఉన్నప్పుడు ఈ పిచ్చి హృదయం అంతకంటే ఏం చేస్తుందిలే)' అని పలవరించింది. 'జూలీ ఐ లవ్ యూ...' అని కలవరించింది ఆ తరం. ఆ వెండితెర వెలుగుజిలుగుల కలిమి- లక్ష్మిని చూడగానే 'మై హార్ట్ ఈజ్ బీటింగ్...' అనుకోనివారు లేరంటే కొంచెం కూడా అతిశయోక్తి లేదు. అటువంటి అసాధారణ ప్రతిభాశాలి, అభినయ సౌందర్య స్వాతిశయ రూపిణి నటి లక్ష్మి గారికి హార్దిక జన్మదిన శుభాకాంక్షలు !

లక్ష్మి తమిళనాడులోని చెన్నైలోపుట్టి పెరిగింది . ఆమె తల్లికుమారి రుక్మిణి తమిళనటి. ఆమె తండ్రి వైవీ రావు (యరగుడిపాటి వరద రావు) తెలుగు నిర్మాత, దర్శకుడు, థెస్పియన్, స్క్రీన్ రైటర్, ఎడిటర్ మరియు నటుడు, ప్రధానంగా తెలుగు, కన్నడ, మలయాళం మరియు తమిళసి నిమాల్లో తన ప్రతిభకు మరియు చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి మూఖి నుండి టాకీ వరకు పనిచేసి పితామహుడిగా ప్రసిద్ధి చెందారు. లక్ష్మి తన మొదటి మలయాళ చిత్రం చట్టకారి (1974)తో కీర్తిని గడించింది, ఇది ఆమెకుఉత్తమ నటిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డును గెలుచుకుంది. బెంగళూరు థియేటర్‌లో 40 వారాల పాటు నిరంతరాయంగా నడిచిన తొలి మలయాళ చిత్రంగా ఇది గుర్తింపు పొందింది. చట్టకారి (1974) హిందీలో జూలీగా (1975)గా ఈ చిత్రాన్ని విజయ ప్రొడక్షన్ వారు పునర్నిర్మించారు. మరియు తెలుగులో మిస్ జూలీ ప్రేమ కథ (1975)గా రీమేక్ చేయబడింది. ఫిల్మ్‌ఫేర్ ఉత్తమ నటి అవార్డుతో పాటు ,ఆమె జూలీ లో ఆమె చేసిన పనికి బెంగాల్ ఫిల్మ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ అవా ర్డులను "సంవత్సరపు అత్యుత్తమ పని"కి కూడా గెలుచుకుంది. ఆమె నటిగా బహుముఖ ప్రజ్ఞకు మరియు ఆమె మూర్తీభవించిన ఆకర్షణీయమైన దృక్పథానికి ప్రసిద్ధి చెందింది. తెలుగు చిత్రం పంతులమ్మలో ఆమె నటన తరచుగా ఆమె ఉత్తమ ప్రదర్శనలలో ఒకటిగా తెలుగు ప్రేక్షకులు గుర్తు చేసుకుంటారు.

మిథునం సినిమాలో 'ద్రాక్షారం సంబంధం లేదుట...' అని బుచ్చిలక్ష్మి భర్త నారదాసు సంతోషి స్తాడు. కానీ ప్రేక్షకుడు మాత్రం బాధ పడతాడు- లక్ష్మి వంటి అద్భుతమైన స్త్రీమూర్తికి ఇంకా ఏదో అతిలోక గంధర్వుడితో కళ్యాణం కావల్సి ఉండేదని. 'మిథునం' సినిమాలో నటించే నాటికి లక్ష్మికి 60 ఏళ్లు నిండాయి (1952లో డిసెంబర్ 13న మద్రాసులో పుట్టారు). అయినా, ఆమె ఆకర్షణ, ఆమె పట్ల ఆరాధన తగ్గలేదు. కొన్నేళ్ళ క్రితం విడుదలైన 'ఓ బేబీ' సినిమాలో 70 ఏళ్ళ వృద్ధురాలైన లక్ష్మి- 20 ఏళ్ళ సమంతాగా మారిపోతుంది. అయినా, ప్రేక్షక హృదయాల్లో 70 ఏళ్ళ లక్ష్మే కొలువైందంటే ఆమె అందం- అభినయాల మేలైన కలయిక కావడం వల్లనే.

# అసాధారణ ప్రతిభాశాలి!

ఆమె తొలి మలయాళ చిత్రం చట్టకారి విజయం తర్వాత , ఆమె మలయాళంలో ఇతర చిత్రాలలోనటించింది. "చలనం", "మోహినియాట్టం" చిత్రాలలో ఆమె నటనకు ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకుంది. ఆమె దాదాపు దక్షిణ భారతదేశంలోని ప్రముఖ నటులు మరియు తారలతో నటించింది. అయితే 70, 80దశకాల్లో ప్రసిద్ధ కన్నడస్టార్ అనంత్ నాగ్‌తోఆమె ప్రేక్షకులను అలరించింది. నాగ్, లక్ష్మి సౌత్ ఇండియన్ సినిమాలో ఆల్-టైమ్ గ్రేట్ జోడీగా ఎంపికైంది. 25కి పైగా సినిమాల్లో కలిసి నటించారు. వారి జంట విజయానికి సరైన రెసిపీగా పరిగణించబడింది ఆ రోజుల్లో. కన్నడ "తారసు" నవలల ఆధారంగా వచ్చిన చాలా సినిమాలు మధ్యతరగతి యువ జంటల జీవితంపై ఆధారపడి ఉన్నాయి.

**లక్ష్మి వ్యక్తిగత జీవితం అనేక వివాదాలమయం. ముక్కుసూటితనం, ధీరగుణం ఉన్న ఏ స్త్రీ జీవితంలో అయినా సవాళ్లు, ఎదురుదెబ్బలూ సహజమే. స్త్రీ తన స్వేచ్ఛ కోసం, సమానమైన హక్కుల కోసం తపనపడితే ఆమె జీవితాన్ని సుడిగుండంలో నెట్టడానికే ప్రపంచమంతా చూస్తుంది. ఆ సుడిగుండాన్ని ఎదురీది గెలిచి నిలిచే లక్ష్మి వంటి వారు అరుదు. ఆమె తన వ్యక్తిగతల విషయాలను మీడియాతో పంచుకోవడానికి ఇష్టపడరు. కానీ, ఆమె పాల్గొనే టీవి టాక్ షోల వల్ల, ఆ షోలలో ఏ విషయాన్ని అయినా కుండబద్దలు కొట్టినట్లుగా మాట్లాడే ఆమె తీరు వల్ల ఆమె జీవితంలో ఆటుపోట్లు, ఆమె ఆలోచనలూ బైటకి తెలుస్తుంటాయి.**

అయితే జూలీలో విజయం సాధించిన తర్వాత, లక్ష్మి చాలా హిందీ చిత్రాలలో నటించలేదు. బదులుగా మరిన్ని దక్షిణ భారత చిత్రాలపై దృష్టి పెట్టింది. ఆమె సిల నేరంగళిల్ సిల మణితర్గళ్ (1977) చిత్రంఉత్తమ నటిగా జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకుంది. తమిళ చిత్రం కోసం ఆ వర్గాన్ని గెలుచుకున్న మొదటి దక్షిణ భారతీయ నటిమణులలో ఒకరు.

లక్ష్మి సూర్య టీవీలో మలయాళ రియాలిటీ షో ఛాంపియన్స్ కోసం న్యాయనిర్ణేతల ప్యానెల్‌లో ఉంది. జీ కన్నడలో డ్రామా జూనియర్స్ అనే కన్నడరియాల్టీ షోకు ఆమె న్యాయనిర్ణేతగా కూడా ఉన్నారు. ఆమె మొత్తం 333 చిత్రాలలో నటించింది.

## వ్యక్తిగత జీవితం

ఆమె మొదటి వివాహం 1969లో భీమా సంస్థలో పనిచేసిన భాస్కర్‌తో జరిగింది. ఈ దంపతులకు 1971లో జన్మించిన నటి ఐశ్వర్య అనేఒకే ఒక కుమార్తె ఉంది. అయితే, లక్ష్మి 1974లో భాస్కర్‌కి విడాకులు తీసుకున్నారు. ఆమె రెండవ వివాహం చట్టకారి సెట్స్‌లోతన సహ నటుడు మోహన్‌శర్మతో 1975లో అతనిని వివాహం చేసుకుంది, అయితే అది 1980లో విడాకులతో ముగిసింది. ఆమె ఎన్ ఉయిర్ కన్నమ్మ(1988) షూటింగ్‌లో ఉండగా, ఆమె మరియు నటుడు-దర్శకుడు ఎం.శివచంద్రన్1987లో ప్రేమించుకున్నారు మరియు వివాహం చేసుకున్నారు. ఈ జంట 2000లో సంయుక్త అనే అమ్మాయిని దత్తత తీసుకున్నారు.

ఒక దశాబ్దానికి పైగా ప్రధాన నటిగా కనిపించిన తర్వాత, ఆమె క్యారెక్టర్ పాత్రలకు మారారు. ఫిలింఫేర్ అవార్డ్స్ సౌత్ నాలుగు సౌత్ భాషలలో ఫిలింఫేర్ అవార్డు ఉత్తమ నటిగా ఎనిమిది సార్లు వివిధ భారతీయ భాషలలో గెలుచుకున్న ఏకైక నటి ఆమె . వరకు హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం అనే 5 ప్రధాన చిత్ర పరిశ్రమలలో ఉత్తమనటిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును గెలుచుకున్న ఏకైక నటి ఆమె.. ఇప్పటి వరకు లక్ష్మి మినహా మిగిలిన 4 దక్షిణాది రాష్ట్రాల్లో ఏ సౌత్ నటి రాష్ట్ర అవార్డును గెలుచుకోలేదు. ఉత్తమ నటిగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డులు, జాతీయ అవార్డును గెలుచుకున్న ఏకైక నటి కూడా ఆమె .

ఇది ఆమెను దక్షిణ భారతదేశం అంతటా మరియు ఇప్పుడు పాన్ ఇండియా హిందీ బెల్ట్‌లోఅత్యంత బహుముఖ, ప్రసిద్ధ నటిగా చేసింది కాబట్టి ఆమె ప్రారంభ పాన్‌ఇండియన్ స్టార్‌లలో ఒకరుగా పేర్కొనవచ్చు.

### తెలుగులో ప్రస్థానం..

**1968లోనే 'బాంధవ్యాలు'లో సావిత్రికి కూతురుగా నటించి తెలుగువారికి పరిచయం అయినా, ఆమెని ఎక్కువ చెల్లి, కూతురు వంటి సహాయక పాత్రలకే పరిమితం చేసింది తెలుగు సినీ రంగం. 'జీవన తరంగాలు', 'పల్లెటూరి బావ', 'సుపుత్రుడు', 'పుట్టినిల్లు-మెట్టినిల్లు', 'అందరూ దొంగలే', 'బంగారు కలలు', 'అమ్మాయిల శపథం', 'చట్టానికి కళ్ళు లేవు'.. వంటివి కొన్ని ఉదాహరణలు మాత్రమే. అయితే, అవన్నీ ఒకెత్తు, 1978లో లక్ష్మి టైటిల్ రోల్ పోషించిన 'పంతులమ్మ' చిత్రం ఒక్కటే ఒకెత్తు. కె. బాలచందర్ పర్యవేక్షణలో ఆమె మీది, నాది మరియు మాది : కన్నడచిత్రం మక్కల సైన్య (1980 తమిళ వెర్షన్ మజలై పట్టాళం ) యొక్క రీమేక్‌తో దర్శకురాలిగా అరంగేట్రం చేసింది. ప్రముఖ మహిళగా ఆమె కెరీర్ 1980లో ముగిసినప్పుడు, ఆమె తల్లిగా మరియు తరువాత అమ్మమ్మగా సహాయక పాత్రలు పోషించడం ప్రారం భించింది. ఆమె తమిళ మ్యూజికల్ బ్లాక్ బస్టర్ చిత్రం జీన్స్ (1998)లో ఐశ్వర్యరాయ్ అమ్మమ్మగా మరియు హిట్ చిత్రం హల్చల్ (2004)లో కరీనాకపూర్ అమ్మమ్మగా నటించింది. తను ఒక అమ్మగా, అమ్మమ్మగా, ఇతర క్యారెక్టర్లలో జీవించేస్తుంది. ఓ బేబీ సినిమాలోనూ తను ప్రధాన పాత్ర పోషించింది. మురారి సినిమాలోనూ తన పాత్రకు మంచి పేరు వచ్చింది. నిజానికి తను 15 ఏళ్ల వయసులోనే సినిమాల్లోకి అడుగుపెట్టింది. ప్రస్తుతం తనకు 70 ఏళ్లు దగ్గరికి వస్తున్నా.. ఇంకా తన సినిమా ఇండస్ట్రీలో అడపా దడపా సినిమాలు చేస్తోంది.**

## బెహరా మనోవికాస కేంద్రంలో అల్పాహారవితరణ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సేవ ఒక సామాజిక బాధ్యతని శ్రీకాకుళం సీనియర్ కెమెరామెన్ భైరి శ్యామ్ సుందర్ అన్నారు. స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద గల బెహరా మనో వికాస కేంద్రంలో శుక్రవారం శ్యామ్‌సుందర్ తండ్రి భైరి వరప్రసాదరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యులు అల్పాహారవితరణ చేపట్టారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ ప్రథమ వర్ధంతి రోజు ఇంతమంది పిల్లల మధ్య జరుపుకోవటం ఆనందంగా ఉందని, ఇక్కడ పిల్లలను చూస్తుంటే బాధగా వుందని, కల్మషంలేని పిల్లలని ఈ రోజు ఒక మంచి ఆలోచనతో వీరికి సేవ చెయ్యటం ఒక వరంగా బావిస్తున్నామన్నారు. ప్రతీఒక్కరూ తమ వేడుకలను ఇలాంటి ఆశ్రమాలలో జరుపుకుంటే ఆత్మ సంతృప్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, రాజు మోహన్, విజయ్ ప్రసాద్, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



## దాతలు ఆదుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




నిరుపేద కుటుంబాలను దాతలు ఆదుకోవాలని సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు తెలిపారు. నరసన్నపేట మండలం గుండి విల్లిపేట గ్రామానికి చెందిన ముందూరి సూర్యనారాయణ స్థానిక రైస్ మిల్‌లో పనిచేస్తూ కిందకి పడిపోయి రెండుకాళ్ళు విరిగిపోవడంతో ప్రస్తుతం వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇతని వయస్సు 60 సంవత్సరాలు కాగా శస్త్ర చికిత్సకు సుమారు రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని పరీక్షించిన వైద్యులు తెలిపారు. పేదకుటుంబం అందులోనూ ఇతని సంపాదన మీదే కుటుంబం మొత్తం ఆధారపడి వుండడంతో కుటుంబసభ్యులు దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలుసుకున్న సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సంస్థ సభ్యులు శుక్రవారం సంస్థ తరుపున రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, బాలకృష్ణ, గిరీశం, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# విద్యుత్ ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

విద్యుత్ ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సి. హెచ్.అమ్మన్నాయుడు, నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం ఆధ్వర్యంలో రణస్థలం రామతీర్థం రోడ్‌లో నిరసన తెలియజేసి విద్యుత్‌బిల్లులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదానీతో జరిగిన అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేసారు. రైతులు, ప్రజల పాలిట ఉరితాళ్ళుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేసారు. వైసిపి ప్రభుత్వం పంపు సెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ నేతలు మీటర్లు పగల గొట్టాలని పిలుపునిచ్చారు. అదానీ, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి, వేలాది కోట్ల రూపాయలు అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని నాడు ఆరోపించారు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమే అన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుంది. ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాలి. బ్యాలెన్స్ పూర్తి కాగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. పేదలకు అంధకారమే మిగులుతుంది. మరోవైపు ప్రతి మీటర్ కు అయ్యే వ్యయం 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వేలాది రూపాయలు వినియోగదారుల నుండే వసూలు చేస్తారు. మరోవైపు విద్యుత్ అధికంగా వినియోగించే రాత్రి వేళల్లో అధిక రేట్లు వసూలు చేయటం నడ్డి విరిచే భారం. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెట్లకు మీటర్లు బిగిస్తున్నారు. ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రయివేటు విద్యుత్ ఉత్పత్తి దారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్‌ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాడు వైకాపా, నేడు టీడీపీ, జనసేన పార్టీలు ఈ మీటర్లను కొనసాగించడం గర్హణీయమన్నారు. ట్రూఅప్ చార్జీలు విధించి మరోవైపు స్మార్ట్‌మీటర్లు బిగిస్తూ ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీల అంశంపై వైకాపా దారిలోనే తెలుగుదేశం ప్రభుత్వం ప్రయాణిస్తుందన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేయాలి. అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి. స్మార్ట్ మీటర్లు ఆపాలని, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అభివృద్ధి ప్రధాత, విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కల్లేపల్లి గ్రామస్తులు అన్నారు. నగరంలోని విశాఖ ఏ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో కల్లేపల్లి గ్రామస్తులు టిడిపిలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ వారికి టిడిపి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోక దీనావస్థలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరు అందుకున్నాయని, శంకరన్న హయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చెబుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో కార్యకర్తలకు, నాయకులకు ఎటువంటి గౌరవం లేకుండా పోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు గుర్తింపు గౌరవం లభిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో పనిచేసేందుకు తామంతా




సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి ఆదరణ లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రజలు స్వతహాగా పార్టీలో వచ్చి చేరడం ఇది శుభ పరిణామం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మూకల్ల శీను, మూకల్ల జయానంద్, శీర రమణయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### తూర్పుకాపు సంక్షేమ సంఘం యువజన విభాగం
## వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం యువజన విభాగ శ్రీకాకుళం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుమ్మడి శాంతారావును నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గుమ్మడి శాంతారావు మాట్లాడుతూ తూర్పుకాపుజాతి అభ్యుదయం కోసం నిరంతరం పనిచేస్తానని, తనకు అప్పగించిన పదవికి శతశాతం న్యాయం చేస్తానన్నారు, తూర్పుకాపుజాతి ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సంఘ పెద్దల సూచనల మేరకు ఎటువంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉంటానన్నారు.

## విద్యార్థులు వివేకానంద సాహిత్యాన్ని అధ్యయనం చేయాలి

(సత్యంన్యూస్, పలాస)

భారతదేశ ఔన్నత్యాన్ని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానందుని జీవితచరిత్రను, సాహిత్యాన్ని విద్యార్థులు విధిగా అధ్యయనం చేయాలని విశాఖపట్నం రామకృష్ణ మిషన్ ఆశ్రమస్వామీజీ కృష్ణ సఖానంద అన్నారు. ఉత్తరాంధ్ర రామకృష్ణ- వివేకానంద భావ ప్రచార పరిషత్ సంయుక్తంగా నిర్వహణలో పలాస పట్టణంలో శుక్రవారం నిర్వహించిన యువజనోత్సవంలో ఆయన "మేన్ మేకింగ్-నేషన్ బిల్డింగ్ ఎడ్యుకేషన్" అన్న అంశంపై ప్రసంగించారు. అజేయమైన యువశక్తి భారతదేశం సొంతమని, ఆయన యువశక్తి వల్లనే అఖండ భారత నిర్మాణం జరగాలని, తద్వారా భారతదేశం విశ్వగురువు కావాలన్న దేశసేవకు అంకితం కావాలని ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి విద్యార్థులకు వివేకానంద ప్రభోదాలను వివరించారు. కార్యక్రమంలో తొలుత పలాస పట్టణంలో వేలాది విద్యార్థులతో, భక్తులతో శోభాయాత్ర నిర్వహించారు. స్వామి సేవ్యానంద, డీవీఎస్‌రాజులు విద్యార్థుల్లో ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్వామీజీలు, మాతాజీలు, భక్తులు పాల్గొన్నారు.




## వాలంటరీ వ్యవస్థ అతి కీలకమైనది


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ప్రజల వద్దకు పాలనకు వాలంటరీ వ్యవస్థ అత్యంత కీలకమైనదని, ఏ ప్రభుత్వాలైన వాటిని బలోపేతం చేయాలి కానీ నిర్వీర్యం చేయకూడదని అఖిల భారత బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర మహిళా కన్వీనర్, సంఘ సేవకురాలు డాక్టర్ సీపాన గుణవతి అన్నారు. ఈ విషయం శుక్రవారం ఆమె మీడియాకు తెలిపారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలకు వాలంటీర్లు వెనుదన్ను లాంటి వారని, గత ఐదేళ్లు వారు ప్రజలకు అనేక సేవలందించి ప్రశంసలు పొందారని తెలిపారు. రాష్ట్రంలోనున్న రెండున్నర లక్షలమంది పట్టభద్రులు, పదో తరగతి చదివిన వారు వాలంటీర్లుగా రూ.5వేల తాత్కాలిక గౌరవ వేతనం పై పనిచేశారని, వారిలో అత్యధిక శాతం బీసీ సామాజిక వర్గం వారే ఉన్నారన్నారు. వారి సేవలు ఇప్పుడు లేనందువలన గ్రామ సచివాలయాల సేవలు కొన్ని ప్రాంతాల్లో మందగిస్తున్నాయని, దీని ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని డాక్టర్ గుణవతి తెలిపారు. లక్షలాది రూపాయల వేతనాలు తీసుకుని ఏ సి గదులకు పరిమితమైన అధికారుల కంటే, ఐదు వేల రూపాయల గౌరవ వేతనానికే అపారమైన ప్రజలకు సేవలందించిన వాలంటర్లు ఏంతో మిన్న అని ఆమె కొనియాడారు. వారి గత సేవలను దృష్టిలో పెట్టుకుని విద్యార్హతను బట్టి ఉద్యోగాలు నియామకంలో రిజర్వేషన్ కల్పించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలించాలని ఆమె కోరారు. గత ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీ మేరకు వాలంటరీ వ్యవస్థను ప్రవేశపెట్టి, వారికి రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని డాక్టర్ గుణవతి డిమాండ్ చేశారు.

## ఎలిఫెంట్ పార్కు ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, కొత్తూరు)



కొత్తూరు, భామిని, సీతంపేట మండలాల్లో గత దశాబ్ద కాలానికి పైగా ఏనుగులగుంపు నుండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏనుగుల దాడిలో దాదాపుగా కొన్ని లక్షల రూపాయల పంటనష్టం, పదులసంఖ్యలో ప్రాణనష్టం, అలాగే ఎలిఫెంట్ ట్రేకర్స్ కూడా చనిపోతున్న ప్రభుత్వాలు మారుతున్న వీటిని అదుపు చేసే చర్యలు మాత్రం శూన్యం అనే ప్రజలు బాధపడుతున్నారు. సీతంపేట మండలం గుమ్మడి దగ్గర ప్రభుత్వ టేకుతోట దాదాపుగా 600 ఎకరాలు పైన ఉన్నప్పటికీ దానిలో ఎలిఫెంట్ పార్క్ తయారు చేసే దిశగా అడుగులు వేయకపోవడం బాధాకరమైన ప్రజలు వాపోతున్నారు. ఎలిఫెంట్‌పార్క్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతోపాటు ప్రజలకు నష్ట నివారణ తగ్గుతుందని పేర్కొంటున్నారు. దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీఓను వారు కోరుతున్నారు.

## 15న సబ్‌జూనియర్ ఆర్చరీ పోటీలకు ఎంపికలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈనెల 15న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి చిట్టిబాబు తెలిపారు. ఈమేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. అరసవల్లిలో గల ఆదిత్య ఆశ్చర్య అకాడమీలో 15న ఉదయం 10 గంటల నుండి ఈ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన ఈనెల23 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అభ్యర్థులు నాలుగు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్, ఎంట్రీ ఫీజుతో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9440677201, 9989978727 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

## విద్యార్థులకు అకౌంటింగ్ పై శిక్షణ

(సత్యంన్యూస్, నరసన్నపేట)

ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట అకౌంటింగ్ టాక్సేషన్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జనతేతన సంస్థ డైరెక్టర్ బగాది శశిభూషణ చౌదరి తెలిపారు. ఆన్ ద జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా అకౌంటింగ్ నైపుణ్యాలు, ఆడిటింగ్ ప్రాథమిక భావనలు, ఓచర్ల తయారీలో మెలుకువలు నేర్పించామన్నారు. అకౌంటింగ్ ఓచర్ల వెనుక పత్రసహిత సాక్ష్యాలైన రశీదులు, ఇన్వాయిసుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేట ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచన మేరకు పాలకొండలో ఒకరోజు శిక్షణ నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు.



## సమ సమాజ నిర్మాత స్త్రీ పాత్ర కీలకం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సమాజ నిర్మాత, సృష్టికి జీవం స్త్రీ అని జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయ భారతి అన్నారు. సేవా భారతి, జాతీయ మానవ హక్కుల కమిషన్ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశం లో మహిళలు, మత్యాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంను విజయనగరం, మన్యం, శ్రీకాకుళం ప్రాంత సేవా భారతి జాయింట్ సెక్రటరీ, మహిళా ప్రముఖ్ శ్రీమతి గుండ్రెడ్డి సంయుక్త, శ్రీకాకుళం జిల్లా మత్యకార సమితి ఇంచార్జి జలుమూరు సత్యంలు నిర్వహించారు. సదస్సు ప్రారంభంలో చైర్‌పర్సన్‌ను సభకు సంయుక్త పరిచయం చేశారు. ఉదయం జరిగిన సదస్సులో దేశరక్షణలో మత్యకారులు అవసరమేనని, వారి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ఇంకా జరగవలసినది ఉందని, అటువంటి అంశాలను ప్రాంతీయస్థాయిలో తెలుసుకొనేందుకు సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ తీర ప్రాంత మత్స్యకారులు, నాయకులు పాల్గొని తమ తమ సమస్యలను కమిషన్ చైర్‌పర్సన్ ముందుంచారు. ఆమె అందుకు సానుకూలంగా స్పందించారు. రెండోపూట జిల్లాలో ఉన్న అత్యున్నతస్థాయి ఉద్యోగాలలో ఉన్న వివిధ వర్గాల మహిళలతో కమిషన్ చైర్‌పర్సన్ సమావేశమయ్యారు. మహిళలు అత్యంత శక్తిమంతులని, వేదకాలం, తరువాత స్వాతంత్ర్య సమరం కాలంలో మహిళ స్వత్రంత నిర్ణయాలు తీసుకొని, వాటి అమలుకు గట్టిగా కృషి చేశారన్నారు. అనసూయ, గార్గీ, అహల్యభాయి, హోల్కర్ వంటివరున్నారన్నారు. కానీ వర్తమానం లో వయస్సుతో నిమిత్తం లేకుండా మానభంగాలు, హత్యలు స్త్రీలపై జరగటం శోచనీయమన్నారు. ఈ విషయంలో మహిళలు బలంగా గొంతు వినిపించటమే సదస్సు ఉద్దేశమన్నారు. ఈసందర్భంగా చైర్‌పర్సన్ విజయ భారతిని గురజాడ విద్యాసంస్థల అధినేత ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత జి.వి. స్వామి నాయుడు, డైరెక్టర్ సంయుక్త, కరస్పాండెంట్ రంగారావు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి, ఏసీటీఓ రాణిమోహన్, భూదేవమ్మ, జిల్లా మత్యశాఖ ఉపసంచాలకులు శ్రీనివాస్, రాష్ట్ర మత్స్యకారుల సమితి అధ్యక్షులు మహేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, జిల్లా సంఘ చాలక్ రమణమూర్తి, జగదీష్, కెప్టెన్ వంగ మహేష్‌లు పాల్గొన్నారు.











# విజయ డెయిరీ పాలసేకరణ ధర పెంచాలి




(సత్యంన్యూస్, రణస్థలం)

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవుపాల సేకరణ ధర వెంటనే పెంచాలని, పాలుకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సిటు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, రైతు సంఘం నేత వెలమల రమణ డిమాండ్ చేశారు. ముక్తుంపురంలో ఆంధ్రప్రదేశ్ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో పాలరైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తగ్గించిన ఆవుపాల ధర పెంచాలని కోరుతూ సిటు జిల్లా కార్యాలయంలో ఈ నెల 16న జరిగే పాల రైతులు సదస్సు జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటికే పాల ధర గిట్టుబాటు కావడం లేదని, దాణా, పశువైద్యం అన్నింటికీ ధరలు పెరిగాయని, ఖర్చుల పెరుగుదల నిష్పత్తిలో పాల సేకరణ ధర పెంచాలని పాల రైతులు అడుగుతున్నా విశాఖ డెయిరీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని, ఇంతగా ధర తగ్గించిన సందర్భం ఇంతకు ముందు ఎప్పుడూ లేదన్నారు. 3.5 వెన్నశాతం ఉన్న లీటరు ఆవు పాలకు రైతుకు రూ.34 చెల్లిస్తున్నారని, అవే పాలు మార్కెట్‌లో వినియోగదారులకు వెన్న శాతం తగ్గించి రూ.54కు అమ్ముతున్నారని, 5.5 వెన్న శాతం ఉన్న లీటరు గేదె పాలకు రూ.38 చెల్లిస్తూ అవే పాలను మార్కెట్లో రూ.64కి విక్రయిస్తున్నారని, దీనిపై పాల రైతులు డెయిరీ యాజమాన్యాన్ని నిలదీయాలని, ప్రయోజనాలన్నింటినీ రాబట్టేందుకు పాల రైతులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె. అప్పలనాయుడు, కలిశెట్టి సన్యాసప్పలనాయుడు, సీహెచ్ పాపయ్య, టి.పైడిరాజు, సూరమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల వేధింపులు ఆపాలి




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మున్సిపల్ కార్మికులకు పెంచిన మస్టర్ పాయింట్లను తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం డిమాండ్ చేశారు. గతంలో ఉన్న మూడు మస్టర్ పాయింట్ల స్థానంలో ఐదు మస్టర్ పాయింట్లుగా పెంచడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని అధికారులను కోరినా పట్టించుకోకపోవడంతో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి కార్మికులు విధులు బహిష్కరించి నగరపాలక సంస్థ కార్యాలయం వద్దకు చేరుకొని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్‌కు సమస్యను వివరించారు. సమస్య పరిష్కారానికి మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చొరవ చూపకపోవడంతో ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ శ్రీకాకుళం నగర కమిటీ నాయకులు కళ్యాణ రాజు, ఆకుల శంకరరావు, డి.చిట్టి, ఏ.రాము, డి.యుగంధర్, ఏ.శేఖర్, ఏ.జనార్దన్, ఏ.గురుస్వామి, జె.మాధవి. ఏ.రాజేశ్వరి, పార్వతి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీలో కళ్లేపల్లి గ్రామస్తులు చేరిక




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కళ్లేపల్లి గ్రామస్తులు పేర్కొంటూ విశాఖ-ఏ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ వారికి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని, గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలకు నోచుకోక దీనవస్థలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరందుకున్నాయని, శంకర్ హయాంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో పని చేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మూకళ్ల శీను, మూకళ్ల జయానంద్, శీర రమణయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

జేసీకి వినతి ఇచ్చిన వైకాపా నాయకులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలని జిల్లా వైకాపా నాయకులు జేసీ ఫర్మాన్ అహ్మద్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నదాతకు అండగా వైకాపా పేరిట నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అన్ని నియోజకవర్గాల నుంచి వైకాపా నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకొని పంటకు మద్దతు ధర కల్పించాలని, పెట్టుబడిసాయం, ఇన్సూరెన్స్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు కృష్ణదాస్, మాజీ మంత్రి అప్పలరాజుతో పాటు వైకాపా నాయకులు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

# నకిలీ నోట్లతో విలేకరి అరెస్ట్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక విలేకరిగా సంస్థ నుంచి ఐడెంటిటీ కార్డు ఉన్న ఎన్ని రాజేష్ అనే వ్యక్తిని నకిలీ నోట్లు రవాణా చేస్తున్న కేసులో జి.సిగడాం పోలీసులు మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది. దాదాపు రూ.15 లక్షలు నకిలీ కరెన్సీతో మరో విలేకరికి చెందిన కారులో వెళ్తుండగా, జి.సిగడాం మండలం పెనసాం వద్ద పోలీసులు తనిఖీ చేసి ఫేక్ కరెన్సీగా గుర్తించినట్టు భోగట్టా. అనంతరం పోలీసు విచారణలో విలేకరి రాజేష్ చెప్పిన వివరాల మేరకు రవి అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తుంది.

వీరిని శుక్రవారం పొందూరు కోర్టులో హాజరుపర్చి పోలీస్ కస్టడీకి తరలించనున్నట్టు తెలుస్తుంది. ఈ విచారణ ఇంకా పూర్తికాలేదని, ప్రస్తుతం నిందితుడు చెప్పిన పేర్లను కూడా పరిశీలించి జిల్లాలోకి ఎస్పీ వచ్చిన తర్వాత మరిన్ని అరెస్టులు ఉంటాయని తెలుస్తుంది.

# విద్యార్థినుల ఆకలి తీర్చిన రెడ్‌క్రాస్

'సత్యం' కథనానికి స్పందించిన సేవామూర్తులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక ఇండియన్ ఆర్మీ కాలింగ్ హాస్టల్‌లో విద్యార్థినులు ఆకలితో ఉన్నారని 'సత్యం' బుధవారం ప్రచురించిన కథనంపై జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ స్పందించింది. స్థానిక దీపామహల్ వెనుక ఉన్న బ్యాంకర్స్ కాలనీలో బాలికల హాస్టల్‌లో గురువారం రాత్రి దాదాపు 120 మంది బాలికలకు భోజనాలను ఏర్పాటు చేశారు. ఇండియన్ ఆర్మీ కాలింగ్ వ్యవస్థాపకుడు బీవీ రమణ జైలుపాలవడంతో హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు భోజనం లేకుండా పోయింది. వసూలు చేసిన సొమ్ములు, ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేయడం ద్వారా సంపాదించిన సొమ్ములన్నీ రమణ సంస్థ ఖాతాలో ఉంచకపోవడంతో హాస్టల్‌లో రేషన్ నిండుకుందని 'సత్యం' కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన రెడ్‌క్రాస్ చైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు ప్రస్తుతం హాస్టల్‌లో ఉన్న విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు. ముందుగా వద్దని చెప్పడంతో ఈ ప్రతిపాదన విరమించుకున్నారు. మళ్లీ ఫోన్ చేసి గురువారం రాత్రికి భోజనాలు ఏర్పాటు చేయగలరా? అంటూ కోరడంతో అప్పటికప్పుడు పీఎన్ కాలనీలో ఉన్న పంచాయతన వినాయక దేవాలయంలో వండించి రెడ్‌క్రాస్ సభ్యులతో భోజనాలు ఏర్పాటు చేయించారు.





మన దేశం పుట్టినిల్లుగా విశ్వమంతా కీర్తించే చదరంగం ఆ కుర్రాడు చిన్నతనం నుంచీ ఎంచుకున్న కలల రంగం. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన తన తండ్రి నేర్పిన మెళకువలతో చదరంగంలో తన ప్రయాణాన్ని ప్రారంభించాడు. గురువుల శిక్షణలో ఏటికేడాది ఎదుగుతూ, రాటుదేలుతూ వచ్చిన ఆ కుర్రాడు రేటింగ్ టోర్నమెంట్లలో ప్రతిభ చూపడం మొదలుకొని పారిస్‌లో 'ఫిడే మాస్టర్' కిరీటం అందుకున్న అరుదైన ఆంధ్ర ఆణిముత్యం, సిక్కోలు ముద్దుబిడ్డ. ఆ కుర్రాడి పేరు యెల్లుమహంతి సేతుమాధవ్. తెలుగు రాష్ట్రాలలో వేళ్ల మీద లెక్కపెట్టగలిగిన ఫిడే మాస్టర్ టైటిల్ గ్రహీతలలో సేతుమాధవ్ ఒకడుగా నిలవడంతో సిక్కోలు గడ్డకే అరుదైన ఖ్యాతిని సంపాదించి పెట్టినట్టయింది.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ప్రభుత్వ ప్రోత్సాహముంటే..

సిక్కోలు చదరంగం చిచ్చర పిడుగు సేతుమాధవ్

# మనం మరో గ్రాండ్‌మాస్టర్‌ను చూడొచ్చు






### చిన్ననాటి నుంచి..

శ్రీకాకుళం పట్టణానికి చెందిన చదరంగం క్రీడాకారుడు సేతుమాధవ్ తండ్రి శ్రీనివాస వసంతకుమార్ ఉపాధ్యాయుడు కాగా, తల్లి అనూష గృహిణి. చదరంగంలో తనకున్న ఆసక్తితో, కళాశాల స్థాయిలో చూపిన ప్రతిభతో సరిపెట్టుకున్న తండ్రి తన కుమారుని మాత్రం చదరంగంలో రాణించేలా చేయాలన్న సంకల్పం బలంగా పెట్టుకున్నారు. చిన్నతనం నుంచే చదరంగంలో మెళకువలు నేర్పిస్తూ చిన్న చిన్న పోటీలలో పాల్గొని విజయాలు సాధించేలా శిక్షణ ఇచ్చారు. ఇదే అదనుగా సేతుమాధవ్ కూడా ప్రతిభను ప్రదర్శిస్తూ రావడం విశేషం. ఆటలో మరింత పదును తేలడానికి శిక్షణ అవసరమని గుర్తించిన తండ్రి శ్రీకాకుళం చదరంగం అసోసియేషన్‌కు సేతుమాధవ్‌ను పరిచయం చేశారు. చంద్రమౌళి, భీమారావు, బగాది కిషోర్లతో కూడిన అసోసియేషన్ ప్రతినిధులు సేతుమాధవ్‌ను ప్రోత్సహిస్తూ వచ్చారు. ఓవైపు ఆన్‌లైన్‌లో శిక్షణలు పొందుతూనే ఆసోసియేషన్ టోర్నమెంట్లలో ప్రతిభను చాటుతూ వచ్చాడు.

### అప్రతిహత విజయయాత్ర

రామచంద్ర అకాడమీ కోచ్ అయిన కె.ఆర్.జి.వి. చంద్రమౌళి శిక్షణలో రాటుదేలుతున్న క్రమంలోనే చదరంగంలో తొలి విజయకేతనం ఎగరవేశాడు సేతుమాధవ్. 2018లో శ్రీకాకుళం జిల్లా స్థాయిలో జరిగిన చదరంగంలో పోటీల్లో ప్రథమస్థానం పొందాడు. ఇదే సమయంలో ఏ.సి.ఏ అధ్యక్షుడు సనపల భీమారావు, డి.సి.ఎ అధ్యక్షుడు బగాది కిషోర్ ప్రోత్సాహంతో 2019లో పాలకొల్లులో జరిగిన ఎస్.జి.ఎఫ్ అండర్-14 పోటీల్లో ఐదో స్థానాన్ని పొందాడు. అదే ఏడాది దాద్రానగర్ హవేలీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున తొలిసారిగా ప్రాతినిధ్యం వహించాడు. ఇక అక్కడ నుంచి వెనుదిరిగి చూడలేదు. హైదరాబాద్‌లో ఆల్ ఇండియా ఓపెన్‌లో జాతీయస్థాయి పోటీల్లో అండర్-13 విభాగంలో ప్రథముడిగా నిలిచాడు. మహిళా గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారికకు కోచ్‌గా వ్యవహరించిన రామరాజు శిక్షణలో మరింత పదును తేలిన ఆటతో ముందడుగు వేశాడు. కోవిడ్ కారణంగా 2020, 2021 ఏడాదుల్లో ఆన్లైన్ పోటీల్లో పాల్గొని అండర్-16 విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథముడిగా నిలవగా, జాతీయస్థాయి స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ అండర్-15 పోటీల్లో ఎనిమిదో స్థానాన్ని దక్కించుకున్నాడు. 2021లో ఆన్లైన్లో జరిగిన ఏసియన్ స్కూల్ గేమ్స్ ఛాంపియన్ షిప్‌లో భారత్ తరపున టీం-బికి ప్రాతినిధ్యం వహించాడు. వ్యక్తిగత విభాగంలో 9వ స్థానంలో నిలిచాడు.

ఇవన్నీ ఒక ఎత్తయితే 2019-20 ఏడాదిలో 636 ఎలో రేటింగ్ పాయింట్లు ఒక్కసారిగా పొందడం ద్వారా ఒక్క ఏడాదిలో జాతీయస్థాయిలో అత్యున్నతంగా పాయింట్లు పొందిన ఆటగాడిగా సేతుమాధవ్ నిలిచాడు. ఇది అతని చదరంగం ప్రస్థానాన్ని మరో మలుపు తిప్పింది. 2021లో రాష్ట్రస్థాయిలో జరిగిన ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో ఛాంపియన్‌గా నిలిచాడు. అదే ఏడాది శ్రీకాకుళంలో జరిగిన ఆల్ ఇండియా ఫిడే ఓపెన్ ఛాంపియన్ షిప్‌లో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. నెల్లూరులో జరిగిన ఇంటర్నేషనల్ టోర్నీలో 1600 రేటింగ్ పాయింట్ల దిగువ విభాగంలో ఛాంపియన్‌గా అవతరించి, రూ.50వేల నగదు పురస్కారాన్ని కూడా పొందాడు.




### మరో కలికితురాయి

ఇప్పటి వరకూ దాదాపు 40కి పైగా ఫిడే రేటింగ్ టోర్నమెంట్లలో ప్రతిభ చూపిన సేతుమాధవ్‌కు అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కింది. ఒరిస్సా గ్రాండ్ మాస్టర్ దెబాషిస్ దాస్ శిక్షణలో మెళకువలు ఒడిసిపట్టిన సేతుమాధవ్ 2024 జులై నెలలో ఫ్రాన్స్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో ఏక్సెషన్ కేటగిరీలో 9 రౌండ్లలో ఎనిమిది పాయింట్లు సాధించి ఛాంపియన్‌గా నిలిచాడు. 1000 యూరోలను బహుమతిగా అందుకున్నాడు. ఫ్రాన్స్ ఇటలీ, పోలాండ్ దేశాల్లో వలు అంతర్జాతీయ గ్రాండ్ మాస్టర్ టోర్నమెంట్‌లో 1941 పాయింట్లతో అడుగుపెట్టి 400 ఎలోరెటింగ్ పాయింట్లు సాధించాడు. మొత్తంగా 2341 పాయింట్లకు ఎగబాకాడు. తద్వారా అరుదైన 'ఫిడే మాస్టర్' టైటిల్ సాధించి తన విజయాల ఖాతాలో మరో కలికితురాయిని నమోదు చేసుకున్నాడు.

### వెంటాడుతున్న ఇబ్బందులు:

చదరంగం ఆటలో ఎన్ని ఎత్తులు ఉంటాయో. ఆటలో ఎదిగే క్రమంలో అంతకంటే ఎక్కువ మిట్టపల్లాల్ని చవిచూడాల్సి వస్తుందంటాడు సేతుమాధవ్. ఎందుకంటే చదరంగంలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ కోసం ఆన్లైన్లో తీసుకునే శిక్షణలకు, రేటింగ్ టోర్నమెంట్ల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం ఖర్చుతో కూడుకున్న పని. రేటింగ్ పాయింట్లు పెరిగే కొద్దీ అంతకంటే ఎక్కువ పాయింట్ల కోసం పోటీలు జరిగే వేదికలు వేర్వేరు రాష్ట్రాలు, దేశాల్లో జరుగుతూ ఉండడం వల్ల ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఆటగాళ్లు టోర్నమెంట్లకు వెళ్లాల్సి వస్తోంది. ఏ చిన్న పొరపాటు కారణంగా ఓటమిపాలైనా మళ్లీ ముప్పయి పాయింట్ల దిగువకు రేటింగ్ పడిపోవడం జరుగుతుంది. వాటిని మళ్లీ తిరిగి పొందేందుకు రేటింగ్ టోర్నమెంట్లలో పాల్గొని ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఈ వ్యయప్రయాసలు చదరంగం క్రీడలో రాణించడానికి ఆటగాళ్లకు ప్రధాన అడ్డంకులుగా నిలుస్తున్నాయని అన్నాడు. ప్రభుత్వాలు చేయూతనిస్తే గ్రాండ్ మాస్టర్‌గా ఎదగాలని సేతుమాధవ్ కోరుకుంటున్నాడు.

భారతదేశానికి గర్వకారణమైన చదరంగం ఆటను ఒక కెరీర్‌గా ఎంచుకునే అవకాశాలు మెరుగుపడాలి. ఎన్నో ఆశలతో ఈ రంగంలో అడుగుపెడుతున్న చిన్నారులకు, వాళ్ల ఆశల్ని నిజం చేయాలని ప్రయత్నిస్తున్న తల్లిదండ్రులకు ప్రభుత్వాలు సహకారం అందించాలి. సొంత ఖర్చులు భరించి శిక్షణలు ఇప్పించడం, దేశ, విదేశాలలో జరిగే రేటింగ్ టోర్నమెంట్లకు పంపడం తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా పరిణమిస్తోంది. చదరంగం అసోసియేషన్లతో సమన్వయం చేసుకుంటూ అకాడమీలు నెలకొల్పడం, రేటింగ్ టోర్నమెంట్ల నిర్వహణ, ప్రభుత్వం తరపున రేటింగ్ టోర్నమెంట్లకు హాజరయ్యే ఆటగాళ్లకు ఆర్థిక సాయం వంటి చర్యలు చదరంగం ఆటకు నవతరంలో జీవం పోస్తాయి. ఈ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని సేతుమాధవ్ తండ్రి కోరుతున్నారు.




Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.